నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 నిజామాబాద్ శుక్రవారం 7 మార్చి 2025 ADILABAD NIRMAL



నిర్మల్‌లో పెట్రోకార్ విధులకు వెళ్తున్న మహిళా కానిస్టేబుళ్లు

## మహిళా పోలీసులకు సముచిత స్థానం

- నిర్మల్‌లో పెట్రోకార్ విధుల్లో భాగస్వామ్యం అయిన మహిళా పోలీసులు
- ఎస్పీ జానకి షర్మిలను అభినందించిన డీజీపీ జితేందర్

నిర్మల్ అర్బన్, మార్చి 6 ః మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ జానకి షర్మిల నిర్మల్‌లో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు మహిళా పోలీసులు రిసిప్షనిస్టులుగా విధులు నిర్వహించారు. వీరిని మహిళా సాధికారతలో భాగంగా పోలీసు అధికారులు, మహిళా కానిస్టేబుళ్లను వారంలో ఒక రోజు మెన్ పీసీతో కలిసి పెట్రోకార్‌లో గస్తీ, ఎమర్జెన్సీ రెస్పాన్స్ బాధ్యతలను అప్పగించారు. ఇందులో భాగంగా నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వజ్రమ్మ, లావణ్యలను పెట్రోకార్‌కు పంపించారు. నిర్మల్ పట్టణంతోపాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో మహిళలు విధులు చేపట్టారు. మహిళా కానిస్టేబుళ్లకు పెట్రో కార్ విధులు, పాయింట్ బుక్ చెకింగ్, డయల్ 100 కాల్, ఎంవో అఫెండర్స్ వంటి వాటిని అటెండ్ చేస్తూ.. ప్రజల్లో ధైర్యాన్ని నింపారని ఎస్పీ జానకి షర్మిలను డీజీపీ జితేందర్ అభినందించారు.





తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామంలో నీరు లేక జొన్న పంట ఎండిపోవడంతో పశువులను మేపుతున్న రైతులు

కాంగ్రెస్ తెచ్చిన కరువు



# మేతకు జొన్న

## సాగునీరు లేక పంట వట్టిపోతుండడంతో పశువులను మేపుతున్న రైతులు



- కండ్ల ముందే ఎండిపోతుండడంతో కన్నీరు పెడుతున్న అన్నదాతలు
- అడుగంటిన భూగర్భ జలాలు.. బోర్లు వేసినా నీరు రాని వైనం..
- కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో చివరి ఆయకట్టుకు అందని నీరు
- పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు

ఆదిలాబాద్, మార్చి 6(నమస్తే తెలంగాణ) ః ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా యాసంగిలో సాగైన పంటలు నీరు అందకపోవడంతో వట్టిపోతున్నాయి. జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో జొన్న, శెనగ, పల్లి, గోధుమ పంటలు సాగయ్యాయి. అధికంగా 70 వేల ఎకరాల్లో జొన్న సాగైంది. ప్రస్తుతం జొన్న మంచి ఎదుగుదల దశలో ఉంది. కంకి వచ్చి విత్తులు రావాల్సి ఉండగా నీరు అవసరం అవుతున్నది. భూగర్భ జలాలు అడుగంటడం, పంటను రక్షించుకునేందుకు బోర్లు వేసినా నీరు పడకపోవడంతో నష్టపోవాల్సి వస్తున్నది. చెరువుల నుంచి పంటలకు నీరు అందించాల్సిన కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో నీరంతా వృథాగా పోతున్నది. దీంతో చేసేదేమీ లేక తమ చేలలోనే పశువులను వదులుతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి వేసిన పంటలకు సాగునీరు అందక తమ కండ్ల ముందే ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పశువులను మేపుతున్నామని రైతులు అంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

### కాలువల ద్వారా నీరందించాలి..

నేను ఆరెకరాల్లో జొన్న సాగు చేశా. భూగర్భ జలాలను ఇంకిపోవడంతో బోరు సరిగా పోయడం లేదు. ఏటా యాసంగిలో ఆరెకరాలకు 12 నాజిళ్ల ద్వారా నీటిని అందిస్తా. ఇప్పుడు తొమ్మిది నాజిళ్లు పెట్టినా నీరు పోయడం లేదు. బోరు ఎప్పుడు ఆగిపోతుందో తెలియని దుస్థితి. కంకి దశలో ఉన్న జొన్నకు మరో రెండు తడులు అవసరమవుతాయి. కానీ.. పూర్తిస్థాయిలో నీరు అందించే పరిస్థితి లేదు. మరో వారం రోజుల వరకు బోర్‌లో నీళ్లు ఉండే అవకాశాలున్నాయి. పంట చేతికొస్తుందనే నమ్మకం లేదు. కజ్జర్ల చెరువు కాలువ ద్వారా నీరు వచ్చే అవకాశం ఉన్నా.. అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో నీరు రావడం లేదు. అధికారులు స్పందించి కాలువ ద్వారా నీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

- నవీన్, రైతు, కజ్జర్ల, తలమడుగు మండలం

### రూ.1.25 లక్షలు నష్టపోయే ప్రమాదం ఉంది..

నేను ఆరెకరాల్లో జొన్న సాగు చేశా. సాగు కోసం రూ.1.25 లక్షల అప్పు చేశా. ప్రస్తుతం జొన్న కంకి దశలో ఉంది. మరో రెండు తడుల నీరిస్తే దిగుబడి బాగా వస్తుంది. నేను నాకున్న బోరు ద్వారా గతేడాది 12 నాజిళ్లతో పుష్కలంగా నీరు అందించి మంచి దిగుబడులు పొందా. ఈ ఏడాది మా గ్రామంలో చాలా మంది రైతుల బోర్లలో నీరు అడుగంటిపోయింది. దీంతో బోర్ల నుంచి నీళ్లు వస్తలేవు. ప్రస్తుతం ఆరు నాజిళ్ల ద్వారా నీరు ఇస్తుండగా సరిపోవడం లేదు. బోరు నుంచి నీరు తక్కువగా వస్తుంది. మరో వారం, పది రోజుల్లో బోరు ఎండిపోయే ప్రమాదం ఉంది. దీంతో చేతికొచ్చే పంట నష్టపోయే దుస్థితి నెలకుంది. మా గ్రామంలో చెరువు కాలువ మరమ్మతులు చేస్తే పంటలకు నీరు అందుతుంది.

- గుమ్మల నాందేవ్, రైతు, కజ్జర్ల, తలమడుగు మండలం, ఆదిలాబాద్

తమ గోడును విలపిస్తూ చెబుతున్న బాధిత కుటుంబ సభ్యులు



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్



- మలేషియా బాధితులను నెల రోజుల్లో స్వదేశానికి తీసుకొస్తానని హామీ
- జాన్సన్ నాయక్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్న బాధిత కుటుంబ సభ్యులు

## జాన్సన్ నాయక్ భరోసా

ఖానాపూర్, మార్చి 6 : ఆరు నెలల క్రితం మలేషియా దేశం వెళ్లి అకారణంగా జైలులో శిక్ష అనుభవిస్తున్న బాధితులను నెల రోజుల్లో స్వదేశానికి తీసుకొస్తానని బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. బాధితుల కోసం మలేషియా వెళ్లి గురువారం ఖానాపూర్‌కు తిరిగొచ్చారు. ఈ సందర్భంగా కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన ఆరుగురు బాధిత కుటుంబాల సభ్యులు ఆయన క్యాంపు కార్యాలయానికి వచ్చి తమ గోడును వెళ్లబోసుకున్నారు. మా భర్తలను ఇండియాకు వచ్చేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ.. మలేషియా దేశంలో గతేడాది అక్టోబర్ 28న మలేషియా యాక్ట్ కింద పలు కేసులు నమోదు చేసి నరేశ్, భాస్కర్, శంకర్, రాజేశ్వర్, శ్రీనివాస్, రవీందర్‌లు మలాక, ఆఫామోస ప్రాంత జైలులో ఉన్నారన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహకారంతో ప్రత్యేక న్యాయవాదిని ఏర్పాటు చేసి ఇంటికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వారు వచ్చేంత వరకు పూర్తి బాధ్యత తీసుకుంటానని భరోసా కల్పించారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సిమెంట్ పరిశ్రమ



ప్రజాభిప్రాయాన్ని పక్కనబెట్టి అమ్మకానికి సిమెంట్ పరిశ్రమ

# సీసీఐ సామగ్రికి టెండర్

- కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్న కేంద్రం
- నీటిమూటలైన కేంద్ర మంత్రుల హామీలు
- అభివృద్ధి, ఉపాధిని పట్టించుకోని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం
- ఆందోళనకు సిద్ధమవుతున్న సంఘాలు

ఆదిలాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పునః ప్రారంభ విషయంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతున్నది. ప్రజాభిప్రాయాన్ని పక్కన పెట్టి అమ్మకానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా స్క్రాప్, ఇతర సామగ్రిని 71 ఐటంలుగా విభజించి రూ.43.30 కోట్ల ప్రారంభ ధరతో టెండర్లు ఆహ్వానించింది. నేడు(శుక్రవారం) టెండర్లు ప్రారంభించి ఒక రోజు మాత్రమే అవకాశం కల్పించింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆదిలాబాద్ జిల్లా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వివిధ ప్రజాసంఘాలు, భూములు కోల్పోయిన రైతులతోపాటు ఉద్యోగులు, అఖిలపక్షం నాయకులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం సిమెంటు రంగానికి డిమాండ్ ఉన్న నేపథ్యంలో సిమెంటు పరిశ్రమను ప్రారంభించడం వల్ల జిల్లా అభివృద్ధి చెందడంతోపాటు ఐదు వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందని, కేంద్ర ప్రభుత్వం వీటిని పట్టించుకోకుండా సీసీఐని అమ్మకానికి పెట్టిందంటూ ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.

### ప్రారంభ హామీలు ఏమయ్యాయి?

ప్రస్తుతం సిమెంటు వినియోగం అధికంగా ఉంది. డిమాండ్ ఫలితంగా ధరలు బాగా పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమలో ఉత్పత్తి ప్రారంభిస్తే కంపెనీలు లాభాలు వచ్చే అవకాశాలున్నాయి. ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను ప్రారంభిస్తామని కేంద్ర మంత్రులు పలు మార్లు హామీలు ఇచ్చారు. కేంద్ర మాజీ మంత్రి హన్స్‌రాజ్ గంగారం, అప్పటి బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇతర నాయకులతో కలిసి సీసీఐని సందర్శించి పునఃప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆదిలాబాద్‌లో నిర్వహించిన ప్రచార సభకు హాజరైన కేంద్ర మంత్రి అమిత్‌షా కూడా ప్రారంభిస్తామన్నారు. దీంతో ప్రజలు పరిశ్రమ తిరిగి తెరుచుకుంటుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశించినా సీసీఐ ప్రస్తావన లేకపోవడంతో నిరాశ చెందారు. తీరా కేంద్ర ప్రభుత్వం సీసీఐ సామగ్రిని వేలం వేస్తుండడంపై జనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అపారమైన వనరులు ఉన్నా..

ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను పునః ప్రారంభించడానికి అన్ని అవకాశాలున్నాయి. జాతీయ రహదారి-44కు సమీపంలో పరిశ్రమ భూములు ఉన్నాయి. సిమెంటును తరలించడానికి ఆదిలాబాద్ నుంచి రైలు, మహారాష్ట్రతోపాటు ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు రోడ్డు మార్గం ఉంది. 772 ఎకరాల భూములు, 170 ఎకరాల్లో టౌన్‌షిప్, 48 మిలియన్ టన్నుల లైమ్‌స్టోన్ నిల్వలు అందుబాటులో ఉన్నాయి. పరిశ్రమకు అవసరమైన విద్యుత్‌తోపాటు నీటి వనరులు ఉన్నాయి. తక్కువ ఖర్చుతో పరిశ్రమను ప్రారంభించే అవకాశాలున్నా కేంద్రం జిల్లా అభివృద్ధి, యువత ఉపాధిని పక్కన పెట్టి సీసీఐని అమ్మడానికి చర్యలు చేపట్టింది.



## ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం

ఎదులాపురం, మార్చి 6 : ఆదిలాబాద్ జిల్లాలో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 9,114 మంది విద్యార్థులకు 8,720 మంది హాజరు కాగా 394 మంది గైర్హాజరైనట్టు డీఐఈవో జాదవ్ గణేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాత్నాల బస్టాండ్ వద్ద గల బాలుర జూనియర్ కళాశాల కేంద్రంలో విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడు. పరీక్ష రాస్తున్న క్రమంలో బాపురావు బీపీ తగ్గి, కండ్లు తిరిగి పడిపోయడు. గమనించిన ఇన్విజిలేటర్ అక్కడే ఉన్న ఏఎన్ఎంతో ప్రథమ చికిత్స అందించి 108 ద్వారా రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం విద్యార్థి పరిస్థితి బాగుందని వైద్యులు చెబుతున్నారు.



అస్వస్థతకు గురైన విద్యార్థి బాపురావుకి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

### నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ అర్బన్, మార్చి 6 ః నిర్మల్ జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. రెగ్యులర్, ఒకేషనల్ కలిపి 6,102 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా.. ఇందులో 5,806 మంది హాజరయ్యారు. 296 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో పరశురాం తెలిపారు. జనరల్ పరీక్షకు 5,438 మందికి 5,172 మంది హాజరయ్యారు. 266 మంది గైర్హాజరయ్యారు.